# 'సీతమ్మ గోస'

గొబ్బూరు వెంకటానంద రాఘవరావుగారు, బి. ఏ.,

నరసింహారావు పంతులుగారు మంచి తెలివితేటలు గలవారు. బియ్యే. బియ్యల్. పరీక్షలు పాసైనారు. గుమస్తా ఉద్యోగం నుంచి క్రమంగా మేజిస్ట్రేట్ - తాసీల్దార్ - డిప్టీ కలెక్టర్ - ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్ - వగైరా ఉద్యోగాలన్నీ చేసి కొన్నాళ్లు జిల్లాకలెక్టర్ పనికూడా ఆక్టింగుచేసి కొసకు పింఛను పుచ్చుకున్నారు. ఆయన భార్యా సీతమ్మగారు చాలా యోగ్యురాలు. ఆవిడ దైవ భక్తీ, పతిభక్తీ, బంధువులయందు ఆదర బుద్ధీ, పేదలయందు కనికరమూ, దానధర్మములయందు ఆసక్తీ, మొదలైనసుగుణసంపద కలిగిన ఒప్పులకుప్ప. మంచి సౌందర్యవంతురాలు- పంతులుగారు కూడా మంచి న్యాయబుద్ధి గలవారు- చాలా గౌరవమూ, ఘనతా, సంపాదించారు. కాని 'చంద్రుడికి కళంకం' అన్నట్లు, ఆయనకు ద్రవ్యాశా, ప్రథమకోపం. ద్రవ్యాశఅంటే లంచాలు పంచాలు పుచ్చుకొనే రకమని అనుకోబోయేరు సుమండీ! అదికాదు. ఆయన యెప్పుడూ డైరెక్టుగాగాని ఇండైరెక్టుగాగాని లంచాలు పుచ్చుకోడం యెరగరు. ఆయన ద్రవ్యాశ అనేది కేవలమూ లోభత్వం- చూసి చూసి డబ్బు ఖర్చుపెట్టలేక పోవడం. డబ్బుకీ, ప్రాణానికీ లంకెఅంటారే ఆగుణం అని చెప్పవలసివుంటుంది. ప్రథమకోపం అనేది, పితృక్రమాగతంగా వస్తున్నటువంటిన్నీ, అస్తమామూ కూర్చొనివుండడంవల్ల వృద్ధి అయ్యేటటువంటిన్నీ మూలవ్యాధి ఉండడంవల్ల తాటాకులమంటలాగ ఒకొక్కప్పుడు ఆయన మండిపడిపోయి, భార్యను నానా మాటలాడి తిట్టి, కొట్టడం గూడా జరిగిస్తూ ఉండేవాడు. కాలంగడుస్తూవున్నకొద్దీ ఆయన కోపంకూడా పెచ్చుపెరుగుతూ వచ్చింది. ఆ మహాపతివ్రత ఆయనచేత దెబ్బలుతిని, పాపం, ఏడ్చుకుంటూ గదిలోకి పోయి తలుపు వేసుకొనేది. నేరంఉన్నా లేకపోయినా, ప్రతి స్వల్పవిషయానికీ ఆయన పాపం ఆ మహాయిల్లాలిమీద పడిపోయి, కొట్టి, తిట్టి, నానాఅల్లరీ పెడుతూ ఉండేవాడు. మనమల్ని ఎత్తినప్పటికీ ఆ విడకు యీబాధ ఎక్కువగుతున్నది కాని తగ్గలేదు. ఇలాగ బాధపడుతూ ఉన్నప్పటికీ ఆవిడ తన కర్మం ఇలాగున్నదని అనుకొనేది కాని భర్తగారిని ఎప్పుడూ పల్లెత్తుమాట అనలేదు. కోపం వచ్చినప్పుడు ఇలాగ మండిపడినప్పటికీ, తరవాత ఆయన పశ్చాత్తాపపడి 'కోపంమీద ఒళ్ళు ఎరగక అన్నాను. కొట్టేను. మరేమీ అనుకోబోకు' అని ఎన్నో క్షమాపణలు చెప్పుతూవుండేవాడు.

ఒకనాడు ఇంట్లో శుభకార్యం జరిగింది. నలుగురు చుట్టాలూ- బంధువులూ- అంతా వచ్చారు. ఊళ్లో ముత్తైదువులు అంతా చాలామంది, పసుపూ- కుంకానికి వచ్చారు. అటువంటి సమయంలో ఆయనకు రింగుమని కోపం పేడత్తింది. ఆమెను పట్టుకొని ఆయన అనేక తిట్లుతిట్టి, అనరాని మాటలని, దవ

డలు వాచిపోయేట్టు ఎడాపెడా లెంపకాయలు వర్షంకురిపించాడు. ఆదెబ్బలకు పాపం ఆ యిల్లాలు మూర్ఛపడిపోయింది. వచ్చిన చుట్టాలు, పక్కాలు, ముత్తైదువలు- అంతా నిర్ఘాంతపడ్డారు. కొందరు బుద్ధిమంతులు చటుక్కున చన్నీళ్ళు తెచ్చి ముఖంమీదచల్లి విసినికర్రలతో విసిరి, శైత్యోపచారాలు చేసి పాట్లుపడగా కొనకు ఆమెకు తెలివి వచ్చింది. కంటికీ నేలకూ ఒక్కధారగా యేడుస్తూ, చాలా చిన్నబోయి, పాపం, భరింపరాని దుఃఖంతో గదిలోకి వెళ్లిపోయింది. పంతులుగారు పక్కచీడీలో పచారు చేస్తూ, తాను చేసినదానికి పశ్చాత్తాప పడుతూ 'ఎంతకాలం యిలాగ నేను, కోప శీలుడనై, నిష్కారణంగా నా యిల్లాల్ని బాధపెడుతూవుండడం? ఈ దుర్మార్గం మొదలంట నశించిపోవాలె. ఏసాధనం అవలంబించాలె?' అని తనలో తాను గాఢంగా ఆలోచించుకోవడం ఆరంభించాడు. వెంకట్రావు గారు నరసింహారావు పంతులుగారికి సంబంధి. ఆయనతో చనువుగా మాటలాడగలవాడు, ఈ సంగతి గట్టిగా కనుక్కుందామనే సంకల్పంతో అతడు పంతులుగారి దగ్గిరకువచ్చి సంభాషణ ఆరంభించాడు.

వెం:—"ఏమండోయి పంతులుగారూ! ఏఁవిటీ! పేరు సార్థకం చేసుకుంటున్నారే. మీ రిలాంటివారు కాబోతారని ముందు పసిగట్టి తాతగారు మీకీపేరు పెట్టినట్టుంది. ఇదేఁవిటండీ! దురంతం- దొడ్డమ్మగారు మనమల మామ్మ- భూలోకమాత- ఆవిడ యింకా మీచేత దెబ్బలుతినడం యేమిటండీ? ఇది మీకు యేమీ బాగులేదు సుమండీ! కోపంవస్తే నన్నుకూడా రెండుకొట్టండి- తింటాను. అనేమాట లేవో మొహంమెదుట అనేస్తాను—"అని యింకను యేమో చెప్ప బోతూవుంటే అడ్డమువచ్చి-చెయ్యిపట్టుకొని, ఆగమని సంజ్ఞచేసి

"బాబూ! వెంకట్రావూ! అసలు నాలో నేనే లజ్జపడి ఏడుస్తూవుంటే నువ్వు ఇంకా నన్ను పొడిచి కాలుస్తావెందుకూ? నేను చేసింది చాలా తప్పుపని; నాకు తెలుసును. ఐనా, పాలపొంగులాగ ఆ కోపంవచ్చేసరికి నాకు వొళ్లూపయీూ తెలియదు. సున్నపురాళ్లలాగ ఆవివచ్చి రక్తండుడికి వెఱ్ఱెత్తిపోతున్నాను. 'ఏసాధనంచేత యీక్రోధ పిశాచాన్ని సాధిద్దాఁవా' అని యత్నిస్తున్నాను. నమ్ము-నేను మేస్ట్రీట్ పని చేస్తూన్నప్పుడు అనేక నేరాల కనేకమందిని విచారణచేసి శిక్షలువేశాను. ఐనా, యింతవఱకూ నన్ను నేనే శిక్షించుకుంటేనేగాని యీసంకటం కుదరదు. కనుక ఇవాళనుంచి నేను కోపం చేత పాపం చేసినప్పుడల్లా, నన్ను నేనే విచారణ చేసుకొని, భగవత్సాక్షిగా నాకు నేనే తగిన శిక్ష విధించుకుంటాను." అనెను.

వెం:—ఏఁవిటా శిక్ష? గుంజీలుతీస్తారా? లెంపకాయలు కొట్టుకుంటారా? లేకపోతే మీయిల్లాలుగారిచేత పేపబెత్తం దెబ్బలు తింటారా? ఏఁవిటి మీతాత్పర్యం?

నర:—అబ్బే గుంజీలు లెంపకాయలు ఆడదానిచేత దెబ్బలూ తింటే కుదిరేరోగం కాదిది. ఏది చేస్తే ఎవడికి ఎక్కువబాధ కలుగుతుందో ఆశిక్షవేస్తేనే వాడికి నసాళం

అంటె రోగం చప్పగాకుదిరి బుద్ధివస్తుంది. మరేం చేసినా ప్రయోజనంవుండదు. నా Weakness ఏమిటంటే నేను చూసిచూసి డబ్బు ఖర్చుపెట్టలేను. కనుక నేను చేసే నేరాన్నిపట్టి నాకు నేనే జుల్మానా వేసుకుంటాను.

వెం:—ఆజుల్మానా సొమ్ము మాకెవరికైనా యిప్పించండి. సంతోషిస్తాం.

నర:—మనుష్య మాత్రులకు ఎవరికీ యివ్వను. అగ్నిహోత్రుడికి సమర్పిస్తాను.

ఏం:—అంటే రూపాయిలు కరిగించేస్తారా?

నర:—కాదు కాదు కరెన్సీనోట్లు కాల్చేస్తాను.

వెం:—అబ్బే అలావద్దు; మీ యిల్లాలికి యివ్వండి. పాపం.

నర:—అలాగా యివ్వను. ఆయివ్వడం వల్ల నేను వేసుకొనేశిక్షకు ప్రయోజనం వుండదు.

వెం:—పోనీండి ధర్మఖర్చు చెయ్యండి.

నర:—చేసినా ప్రయోజనముండదు. నా కష్టార్జితం నాకళ్లయెదుట నాచేతులతోటి నేను కాల్చుకుంటేనేగాని నాదురాగ్రహమున్నూ అందువల్ల జరుగుతూవున్న పాపములున్నూ పరిహారంకావు. "కోపము పాపములకెల్ల కుదురై యుండున్" అని పెద్దలు చెప్పారు. అదేమాట. ఈరోజు నేరానికి నేను నూరు రూపాయీలు జుల్మానా వేసుకున్నాను. కీలెరిగి వాతపెట్టుకోవాలి. ఈ అంకుశపుపోటు తగిత్తేనే కాని నాలోభత్వం అనే మదపుటేనుగు లొంగుబాటుకురాదు." అని లేచి ఇనపపెట్టెతాళముతీసి నూరురూపాయల నోటుతీసి పట్టుకొని పెట్టెతాళమువేసి వెంకట్రావు యెదుటనే వణుకుతున్న చేతులతో అగ్గిపుల్ల వెలిగించి నోటుకు నిప్పుముట్టించి, కళ్ళనీరు కార్చుకుంటూ నోటు కాల్చి బూడిదచేసేశాడు. ఎంతకష్టపడి ఆర్జించిన సొమ్ము! ఆనోటుమంటలే లోభికి కడుపుమండినంత ఆవేదన కలిగించింది. అతడు పడుతున్న యాతనా, శోకవికారరూపమూ చూడలేక "కలకంఠికంట కన్నీరొలికిన సిరి యింట నుండనొల్లదు సుమతీ" అనుకొనుచు వెంకట్రావు మతిలేని పంతులుగారి సెలవు తీసుకొని వెళ్లెను.

నరసింహారావు పంతులుగారి మనస్సెంతో దుఃఖించింది. నాటినుండి అతనికోపం మందం కావడం ఆరంభించింది. స్వేచ్ఛగా గంతులు వేస్తూవుండే అతని దురాగ్రహమనే గుఱ్ఱానికి నోట్లో కళ్లెము తగిలించినట్లు నిర్బంధం కలిగింది. అయినా అలవాటుచొప్పున దూకి కోపం కలిగినప్పుడు అతను ఒక్కడేగదిలోకి పోయి తనమీద తానే నేరం ఆరోపించుకొని తానే విచారణచేసుకొని తానేశిక్షించుకొని జుల్మానా వేసుకొని పాలిపోయిన ముఖంతోనూ, వణుకుతున్న చేతుల్తోనూ తన ప్రాణంకంటె ప్రియతరమైన ధనంపెట్టె తెరిచి నూరురూపాయీల నోటుతీసి, ఏడుస్తూ నిప్పుముట్టించి "నీఖర్మం అనుభవించక తప్పదు" అని నిట్టూర్పులతో కాల్చి దుఃఖం అనుభవిస్తూ ఉండేవాడు.

ఇలాగు నాలుగైదుసార్లు అయేసరికి అతనికి మరికోపం అన్నది కలగలేదు. సీతమ్మగారిమీద మరి అతనికి కోపం రానేలేదు.

ప్రథమకోపి నరసింహారావు పంతులుగారి నేరాలకు లోభి నరసింహారావుగారికి ప్రాణపదమైన ధనం దగ్ధంఅవుతూ రాగారాగా,తుదకు ఆయన దురాగ్రహాలోభత్వాలు రెండూ, మొదలంటా నశించిపోయినవి.

సీతమ్మ గోస సామాన్యమైనదికాదు. శ్రీరాములవారి సీతమ్మగోస దేవాంతకుడైన రావణాసురుని దుంపతెంపింది. ఈ సీతమ్మ గోసతో సమూలంగా పంతులుగారి క్రోధ లోభాలనే రాక్షసులు నిర్మూలం అయి పోయారు.

కం:—"దానము భోగము నాశము పూని కతో మూడుగతులు భువిధనమునకున్ దానము భోగమునెరుగని హీనుని ధనమునకు గతి తృతీయమె పొసగున్" అనే భర్తృహరి వాక్యాని కప్పుడు పంతులుగారికి అర్థంబోధపడింది. దురాగ్రహ లోభత్వాలను విసర్జించి పంతులుగారు లోకోత్తర చరిత్రమైన భార్యామణితో భగవధ్యానపరాయణులున్ను, ధర్మకార్యాసక్తుడున్ను అయి యోగ్యమైన జీవనము చేస్తూవుండెను. ఈవిధంగా పాపం ఆయిల్లాలిబాధలు తప్పినవి.

---

# ప్రేమదేవి

పోలుకొండ భద్రయ్యగారు

చండభానునికిరణాల చాలనోగిలి
వేడిగాడ్పులనేనెంతో వేగివేగి
నడచినడచి చేరితినొక్కనాడు, విజన
ఘోరకాననమందలి సరసిచెంత.
శీతవాతాంకురములు సుశ్రీలజిమ్మ
పికమధురగానములు స్నిగ్ధవిటపిఛాయ,
లన్నియునునన్నుగన్నన నలరజేసె;
ఆప్రకృతిదేవినిద్దపు టంకసీమ
గాఢతరసుషుప్తినిబడి కలగిపోతి;
సాంద్రతరనీలమేఘాలచాటునుండు
తరళమా తటిల్లతబలె, తన్వియోర్తు
నాదుమున్మందునువాలె సమ్మోదమలర
భయవిషాదలజ్జా ఘనభరముతోడ
నాదుహస్తాబ్జములు మోడ్చి నయముమీర
అతివ' ఎవ్వరిదానవీ వని పలికితి.
దివ్యవాక్సుధాలహరి నాదేవిపలికె
"తల్లినై నీకుప్రేమార్థ దాయినైతి;
చెల్లెలిగనుండి నీప్రేమ కొల్లగొంటి;
ప్రీతిసుతనయి నీప్రేమ ప్రిదులుకొంటి;
నిజముప్రేయసిరూపనై నీదుజీవ
నపువిపంచిక మ్రోయించినానుగాదె;
శూన్యప్రాణపంచకా శావితానమందు
ద్రెళ్లుమనుజులగాపాడ నెల్లయెడల
ప్రేమభిక్షులనిచ్చుచు ప్రీతితోడ
నిన్నిరూపాలవిహరింతు నిచ్చమెయిని
ఏనుప్రేమాధిదేవత ననబరగుదు"
అనుచు, నేమేమొ పలుకుచునామెచనియె
ఈసుఖమయప్రపంచాన నెవరులేక
మోహినై, శిలనై శాంతి పోడిమిచెడి
విసిగి నేనిక యాదేవి విమలచరణ
చింతనాభాగ్యమున నెంతోసంతసిలితి.